ప్రజాశక్తి

ఆదివారం 25 మే 2025

I

అల్లూరి సీతారామరాజు

గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయులకు
బదిలీల చట్టాన్ని వర్తింప చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఉపాధ్యాయ బదిలీల చట్టాన్ని గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు వర్తింపజేయకపోవడం అన్యాయమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి మహేశ్వరరావు నిరసన వ్యక్తం చేశారు శనివారం ఆయన ఇక్కడ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఉద్యోగస్తులకు బదిలీల నిమిత్తం విడుదల చేసినటువంటి జీవోను ఉపాధ్యాయులకు వర్తింపజేయడం తగదన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాల విద్య శాఖలో ఉపాధ్యాయులకు నియామకాలు, జీతభత్యాలు, ప్రమోషన్లు, సెలవులు వంటి అనేక అంశాలు పాఠశాల విద్యాశాఖ నిబంధనలు పాటిస్తూ ఉపాధ్యాయుల బదిలీలకు మాత్రం ఉపాధ్యాయ బదిలీల చట్టానికి భిన్నంగా బదిలీల షెడ్యూల్ విడుదల చేయడం సహేతుకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి గిరిజన సంక్షేమ పాఠశాల విద్య శాఖలో ఉపాధ్యాయులకు బదిలీల చట్టాన్ని వర్తింప చేస్తు రీ షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ ప్రకటించాలి

- పలు సంఘాల డిమాండ్

రంపచోడవరంలో దీక్షలకు మద్దతు తెలిపిన పిడి, పిఇటి అసోసియేషన్ నేతలు

ప్రజాశక్తి -జి.మాడుగుల: ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో లయ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో మండల సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సదస్సులో ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సాగిన ధర్మన్న పడాల్, పాడేరు జోనల్ కమిటీ కన్వీనర్ మత్స్యరాస నారాయణరాజు మాట్లాడుతూ, ఆదివాసి స్పెషల్ డిఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో దపదపాలు ఉద్యమాల సందర్భంగా ప్రభుత్వం ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ నాయకులకు చర్చలకు పిలిచి ముఖ్యమంత్రి 100శాతం రిజర్వేషన్ ఇచ్చుటకు అంగీకరించినట్లు పత్రికల ద్వారా తెలియపరచడం జరిగిందన్నారు. ఈ మేరకు కార్యాచరణ రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమం అనంతరం నూతన కమిటీ ఎన్నికైంది. నూతన కమిటీ మండల కన్వీనర్ గా లకే రామకృష్ణ, ముఖ్య సలహాదారులుగా సాగిన కోటి బాబు, గణేష్ మాస్టర్, మత్స్యరాస మత్స్యరాజు, మాస్టారు, కో కన్వీనర్‌గా పాంగి మత్స్యరాజు, సాగిన ఈశ్వరరావు, వంతల ప్రసాద్‌రావు, వంతల మల్లేశ్వరరావు, నర్మని మచ్చ కొండం నాయుడు, గబ్బడి సన్యాసిదొర, బోనంగి సూరి పడాల్, సేగ్గే లక్ష్మణ్, జల్లి చిన్న 14 మందితో నూతన మండల కమిటీ ఎన్నికైంది.

పెదబయలు: స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని గిరిజన సంఘం జిల్లా నాయకుడు జంపరంగి సునీల్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ స్పెషల్ డిఎస్ సాధన కమిటీ సభ్యులు కూడా రాధాకృష్ణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాడేరు పర్యటనకు ముందు ఆదివాసి స్పెషల్ డిఎస్ ప్రకటన చేయాలన్నారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు.తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో వస్తే జీవో 3ని పునరుద్ధరణ చేస్తానని అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు చెప్పారని, ప్రస్తుతం ఆ ఊసే ఎత్తలేదన్నారు. ఈ కార్యక్రమంలో జంపరంగి సునీల్ కుమార్, మొండిపల్లి చిరంజీవి, కో కన్వీనర్ చెట్టి ప్రభాకర్, కో కన్వీనర్ ఎన్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

ఆదివాసి జెఎసి దీక్షలకు పిడి, పిఇటి అసోసియేషన్ మద్దతు

రంపచోడవరం : 2025 మెగా డిఎస్‌సి నుండి షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీ ఉపాధ్యాయ పోస్టులు మినహాయించి, తక్షణమే శతశాతం స్థానిక ఆదివాసీ పట్టభద్రులతోనే భర్తీ చేసేందుకు ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని పిడి, పిఇటి అసోసియేషన్ డిమాండ్ చేశారు. ఐటిడిఎ ఎదురుగా పదో రోజు రిలే నిరాహార దీక్ష కార్యక్రమానికి ఆదివాసి జెఎసి కోర్ కమిటి సభ్యులు కంగాల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పి.డి, పిఇటి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ ఆదివాసి ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్స్ విడుదల చేయాలని,తక్షణమే (టిఏసి)ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేసి తక్షణమే తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని, జిఒ నంబర్ 3కు చట్టబద్ధత కలించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఎస్టి బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్స్ విడుదల చేయాలన్నారు. ఆదివాసి జెఎసి తలపెట్టిన రిలే నిరాహార దీక్షలకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు జిల్లా పిడి, పి.ఇటి అసోసియేషన్ జిల్లా నాయకులు కె.తిరుపతిరావు, ఎం.చిన్నస్వామిరెడ్డి, కొమరం కిషోర్‌బాబు దొర, కె.మంగాయమ్మ, కలుముల పోతురాజు,ఎం.సుగుణ దొర, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.



కూనవరంలో వినతిపత్రాన్ని ఇస్తున్న గిరిజన సంఘం నేతలు

జి.మాడుగులలో మాట్లాడుతున్న నాయకులు

కూనవరం: ఏజెన్సీలో ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని మండలంలోని కూటూరు సచివాలయంలో విఆర్ఒ బ్రహ్మయ్యకి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5వ షెడ్యూల్ ప్రాంతంలో శతశాతం ఉద్యోగాలు గిరిజనులకు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.వెంకమ్మ, నాయకులు మేకల నాగేశ్వరావు, గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు నూపరాజు, సోడె శ్రీరాములు, కారం కన్నారావు పాల్గొన్నారు. చుచిరేవులగూడెం సచివాలయంలో ఎంపిటిసి కారం జయసుధ, సిపిఎం మండల సభ్యులు మాడేబాబు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ భవానికి వినతిపత్రం అందించారు.

పోలవరం పనులను పరిశీలిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రంపచోడవరం / దేవీపట్నం : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ప్రభుత్వం రివ్యూ సమావేశం నిర్వహించి వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎపి ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. శనివారం పోలవరం ప్రాజెక్టును వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవీపట్నం, చింతూరు, విఆర్.పురం, కూనవరం, ఎటపాక, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలోని 222 పంచాయతీల్లో 373 గ్రామాల్లో 1,06,006 కుటుంబాలు నీట మునుగుతున్నాయని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం రివ్యూ సమావేశం ఏర్పాటు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల బ్యాక్‌వాటర్ పెరుగుతుండడంతో భవిష్యత్‌లో ముంపు మరింత పెరిగే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు శాంతరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి - రంపచోడవరం : ప్రతిరోజు యోగా చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. శనివారం స్థానిక పిఒ చాంబర్లో వివిధ పాఠశాలలకు సంబంధించిన యోగ శిక్షకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో, మండల పరిధిలో, డివిజన్ కేంద్రం పరిధిలో జూన్ 21వరకు యోగ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మాస్టర్ ట్రైనర్లతో ఆయా మండలాల్లో ప్రజలందరికి అవగాహన కల్పిస్తామన్నారు. ఎక్కడికక్కడ యోగా కార్యక్రమాలు నిర్వహించే విధంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అధికారులు, సిబ్బంది కలసికట్టుగా యోగ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు, యోగ మాస్టర్ ట్రైనర్లు కె.తిరుపతిరావు, మంగయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన పసిపాప మృతదేహం తరలింపు

-మధ్యలో వదిలి వెళ్లిన అంబులెన్స్ డ్రైవర్
-ఆలస్యంగా వెలుగులోకి...

ప్రజాశక్తి- అనంతగిరి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు సౌకర్యం లేక గిరిజనులు నరకయాతన పడుతున్నారు. రోడ్డు సౌకర్యాలు లేక ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే డోలి మోతే దిక్కుగా మారుతోంది. .రెండు నెలల పాప అనారోగ్యంతో చికిత్స పొందుతూ విశాఖ కేజీహెచ్లో మృతి చెందితే చిన్నారి భౌతికకాయాన్ని స్వస్థలానికి తీసుకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులు ఎన్నో ఇక్కట్లు పడ్డారు. దేవరాపల్లి వరకు రోడ్డు సౌకర్యం ఉన్నా మృతదేహాన్ని అంబులెన్స్ డ్రైవర్ కొత్తవలస మద్యధారిలో వదిలేసి వెళ్లిపోయిన పరిస్థితి నెలకొంది. అనంతగిరి మండలం పెద్దకోట పంచాయతీ మద్రేబు అనే పీవీటీజీ గ్రామానికి చెందిన సీదిరి శైలు, అర్జున్ దంపతులకు రెండు నెలల పాప ఉంది. ఆమెకు అనారోగ్యం కారణంగా ఈ నెల 8న విశాఖలోని కేజీహెచ్ కు తీసుకు వెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మృతి చెందింది. అక్కడి దేవరపల్లి వరకు మృత దేహాన్ని తరలించాలని కుటుంబ సభ్యులు చేతులు ఎత్తి వేడుకున్నా జాలి లేకుండా మధ్య దారిలో వదిలిసే వెళిపోయారాని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత రూ. 6వేలు ఖర్చు చేసి ఓ ప్రైవేటు ఆటోలో సరియా వరకు తీసుకు రావాల్సి వచ్చింది. ఆ రోజు రాత్రి 9గంటల సమయంలో పాప మృతదేహాన్ని కుటుంబ సభ్యులు భుజంపై మోసుకుంటూ 5కి.మీ మేర కాలి నడకన నడుచుకుంటూ 10గంటల సమయంలో మద్రేబు గ్రామంలో పాప మృతదేహాన్ని తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదిలా ఉండగా దేవరాపల్లి మీదుగా సరియా వరకు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ డ్రైవర్ మాత్రం కొత్తవలసలోనే వదిలేసి వెళ్లిపోవడం సరికాదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.అంబులెన్స్ డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలని మద్రేబుకు చెందిన పీవీటీజీ సంఘం నాయకులు కొండ తాంబలి జగన్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె గోవిందరావు కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు.కనీసం సరియా నుంచి మద్రేబు వరకైనా రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే వచ్చే జెడ్పీ సమావేశాల సమయంలో గుర్రాలతో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

పాప మృతదేహం

నగదు అందిస్తున్న సిడిపిఒ దేవామణి

రాజులమ్మ కుటుంబానికి సిఐటియు అండ

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: కింద్ర కాలనీలోని అంగన్‌వాడి కార్యకర్త రాజులమ్మ కుటుంబానికి సిఐటియు అండగా ఉంటుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు అన్నారు. శుక్రవారం రాత్రి రాజులమ్మ గుండెపోటు తో మృతి చెందింది. శనివారం ఆమె నివాసానికి వచ్చిన రామరాజు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజులమ్మ పార్టీ తరపున చేసే పోరాటాల్లో ఎప్పుడూ ముందుండేదని అంగన్‌వాడిల సమస్యలపై చేసిన పోరాటాల్లో కూడా చురుగ్గా పాల్గొనేదని అలాంటి నిబద్ధత కలిగిన వ్యక్తి అకాల మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. అంగన్‌వాడి యూనియన్ నాయకులు మంగ, సత్యవతి తదితరులు కూడా రాజులమ్మ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. యూనియన్ అండగా ఉంటుందని, అంత్యక్రియల నిమిత్తం రూ.15 వేలు తక్షణ సాయం కింద ఐసిడిఎస్ సిడిపిఒ దేవామణి ద్వారా రాజులమ్మ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసి నేత గంపా నాగరాజు, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజులమ్మ మృతి బాధాకరం : ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి

తనతో బాటు పనిచేసిన అంగన్‌వాడి కార్యకర్త రాజులమ్మ మృతి చాలా బాధాకర మని రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి, విజయభాస్కర్ దంపతులు అన్నారు. శనివారం రాజులమ్మ నివాసానికి ఎమ్మెల్యే మిరియాల శిరీష విజయభాస్కర్ దంపతులు వచ్చి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజులమ్మ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నేతలు

ఎండియు వ్యవస్థను కొనసాగించాలి

ప్రజాశక్తి-చింతపల్లి: రాష్ట్ర ప్రభుత్వం జూన్ 1 నుంచి ఎం.డి.యు (మండల డిపో యూనిట్) ఆధ్వర్యంలో ఇంటింటికీ బియ్యం పంపిణీని నిలిపివేయాలన్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ఎం.డి.యు యూనియన్ మండల అధ్యక్షుడు వనము సింహాచలం, ఉపాధ్యక్షుడు యు.పూర్ణ రవిశంకర్ నేతృత్వంలో పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎం.డి.యు పథకం పేద, బడుగు, బలహీన వర్గాలకు వరంగా మారిందని పేర్కొన్నారు. నేరుగా లబ్ధిదారులకు బియ్యం అందేలా, ఎటువంటి మధ్యవర్తిత్వం లేకుండా ఈ విధానం సమర్థవంతంగా అమలైందన్నారు. ప్రభుత్వం తాత్కాలికంగా ప్రవేశపెట్టిన కొత్త విధానాలు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎం.డి.యు విధానాన్ని కొనసాగించేం దుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ పథకం పేద ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తుందని స్పష్టం చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల్ని అమలు చేస్తూ, ప్రజలకు మేలు చేసే పథకాలను రద్దు చేయాలనే ఉద్దేశంతో వ్యవహరి స్తోందని విమర్శించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.డి.యు యూనియన్ నాయకులు జాన్, నీలకంఠం, సుందర్, సిమోన్, రవి, లావణ్యబాబు పాల్గొన్నారు.

చిన్నశెట్టి రాజుకు పూల మొక్కను అందించి స్వాగతం పలుకుతున్న ధరణి

జ్యుడీషియల్ కోర్టును సందర్శించిన జిల్లా జడ్జి

ప్రజాశక్తి-చింతపల్లి : విశాఖపట్నం జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్న శెట్టిరాజు చింతపల్లి ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా కోర్టు మేజిస్ట్రేట్ న్యాయమూర్తి ధరణి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. కేసుల విచారణ ప్రగతిని, న్యాయసేవల లభ్యతను, కోర్టు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిశీలించారు. కోర్టు సిబ్బందితో పాటు స్థానిక న్యాయవాదులతో కూడా ఆయన ప్రత్యక్షంగా సంభాషించారు. న్యాయవ్యవస్థను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా రూపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు, ఎస్సై వెంకట్రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

పోల'వరమా'.. శాపమా ?

నిర్వాసితుల సమస్యలు పట్టని ప్రభుత్వం
రీ సర్వే చేయకుండానే చేసినట్లు ఆర్ అండ్ఆర్ అధికారుల జిమ్మిక్కులు

ప్రజాశక్తి- చింతూరు : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సంగతి ఎలా ఉన్నా నాలుగు మండలాల్లోని ముంపు గ్రామాలకు చెందిన నిర్వాసితుల బాధలు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వానికి ప్రాజెక్టు నిర్మాణం పట్ల ఉన్న శ్రద్ధ నిర్వాసితుల సమస్యలపై లేదు. నిర్వాసితులకు న్యాయం చేసేందుకు వాస్తవంగా ప్రభుత్వం వైపు నుంచి నిర్దిష్టమైన చర్యలు ఏమీ చేపట్టటం లేదనిపిస్తోంది. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ విషయంలో నిర్వాసితులతో గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రాజెక్ట్ ముంపు ప్రాంతంలో నివాసాలకు పరిహారం ఆపై పునరావాసం విధివిధానాలపై అవగాహన కల్పించారు. అయితే స్థానిక ప్రజలు చాలామంది జీవనోపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్లారు. ఈ క్రమంలో వారికి స్థానిక గుర్తింపు ధ్రువపత్రాల విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయి. వివాహమైన వారికి కూడా అధికారులు వివాహ ధ్రువపత్రాలు కోరుతున్నారు. కట్ ఆఫ్ డేట్ 2022 వరకు మాత్రమే ఉందని తరువాత వివాహం చేసుకున్న వారికి పునరావాసం పరిహారం జాబితాలో పేర్లు ఉండవని అధికారులు చెప్పడంతో నిర్వాసితులు ఖంగు తింటున్నారు. పోలవరం ప్రాజెక్టు నియమావళిలో సర్వే నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకారం పరిహారం అందజేయాలని ఉన్నా ఇక్కడ అలా జరగడం లేదు. దీంతో ఎంతోమంది ముంపు బాధితులు నిరాశకు గురవుతున్నారు. ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్న అధికారులను డిప్యూటీ కలెక్టర్లుగా నియమించడం, వారికి విషయం పూర్తిగా అవగాహన కలిగేసరికి వారిని బదిలీ చేయడం వారి స్థానంలో మళ్లీ కొత్తవారు రావడం ఇదే తంతు జరుగుతోంది. చింతూరు కేంద్రంగా నాలుగు విలీన మండలాలకు నలుగురు డిప్యూటీ కలెక్టర్లను నియమించారు. 47 సంవత్సరాలుగా ఇల్లు నిర్మించుకుని ఉన్న నిర్వాసిత కుటుంబాలకు ఆర్అండ్ఆర్ జాబితాలో వారి పేర్లు లేవు. కాని ఇల్లు వదిలేసి వెళ్లిపోయిన వారికి, ఇల్లే లేని ఖాళీ స్థలానికి ఐదు నుండి ఆరు లక్షల రూపాయల ప్యాకేజీ జాబితాలో వారి పేరు ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. 41.15 కాంటూరు ప్రాధాన్యత క్రమంలో చింతూరు మండల కేంద్రాన్ని చేర్చాలని గతంలో ఆందోళన చేసిన నేపథ్యంలో పోలవరం అధికారులు మొదటి ప్రాధాన్యత కాంటూర్ పరిధిలో చేర్చడం జరిగింది. కానీ 1600 కుటుంబాలకు గాను సుమారు 300 కుటుంబాలకు ఇంకా ఆర్అండ్ఆర్ సర్వే జాబితాలో పేర్లు లేకపోవడం విచారించదగ్గ విషయం. అవార్డు ఎంక్వయిరీ నోటీసులో ఇంటి ఆవరణలో ఉన్న తాగునీటి బోరును ఇంటి స్ట్రక్చర్ వ్యాల్యూలో కలపాలని దరఖాస్తు చేసుకున్న కొంతమంది నిర్వాసితులకు 13.50 లక్షలపై స్ట్రక్చర్ వాల్యూ ఉండగా రీవాల్యుయేషన్ చేసి ఐదు లక్షలు కట్ చేసి అవార్డ్ ఎంక్వైయిరీ నోటీస్ ఇచ్చారు. రీ సర్వే చేసి ఉన్నదాంట్లోనే భారీగా తగ్గించి అవార్డు నోటీస్ ఇవ్వడం అన్యాయమని పలువురు బాధితులు వాపోతున్నారు. ఆర్అండ్బి అధికారులు రీ సర్వే చేయకుండానే సర్వే చేసినట్లు రికార్డులు సృష్టించి పోలవరం కార్యాలయంలో ఉంచుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం నైపుణ్యత కలిగి సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉన్న అధికారులను పోలవరం పనులకు నియమించాలని ముంపు మండలాల ప్రజలు కోరుతున్నారు.

రీ సర్వే కోరితే అవార్డు ఎంక్వైరీ నోటీసు ఇచ్చిన ఇల్లు

23 మందికి వైద్య పరీక్షలు

వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ఖాదర్‌మస్తాన్‌వల్లి

ప్రజాశక్తి - సీలేరు : జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని జికె వీధి మండలం సీలేరు పిహెచ్‌సి వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌వల్లి వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జికె వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపు లైకాన్‌పూర్, చంద్రుపల్లిలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. 23 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌వల్లీ మాట్లాడుతూ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సూపర్‌వైజర్లు త్రినాథ, బి.బాలామణి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, సామాజిక ఆరోగ్యకార్యకర్తలు కొర్ర మంగాత్ కిలో రాధమ్మ గిరిజనులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ఘోర ప్రమాదం

ప్రజాశక్తి - రంపచోడవరం : భద్రాచలం కాకినాడ ఆర్టిసి బస్సుకు త్రుటిలో భారీ ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే రంపచోడవరం మండలం సీతపల్లి ఆర్అండ్ఆర్ కాలనీ సమీపంలో శనివారం మధ్యాహ్న సమయంలో భద్రాచలం నుండి కాకినాడకు వెళ్తున్న బస్సు సీతపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ఇసుక లారీని తప్పించే క్రమంలో అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది పక్కనే పెద్ద లోయ ఉండడంతో అంతా ఆందోళన చెందారు. బస్సులో సుమారు 55 మంది ప్రయాణికులు చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. దీంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొన్న బస్సు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సంతోష్‌కుమార్

అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలి

సిఐటియు నాయకులు పులి సంతోష్ కుమార్

ప్రజాశక్తి - విఆర్‌పురం: 2022లో సుప్రీంకోర్టు అంగన్‌వాడిలకు గ్రాట్యుటి అమలు చేయాలని ఇచ్చిన తీర్పు ఈనాటికి అమలు కాలేదని, తక్షణమే కూటమి ప్రభుత్వం గ్రాట్యుటిని అమలు చేయాలని సిఐటియు నాయకులు పులిసంతోష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం చిన్నమటపల్లిలో అంగన్‌వాడిల మండల స్థాయి సమావేశం కనకమహాలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. సంతోష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అంగన్‌వాడిలను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. 2019 నుండి అంగన్‌వాడిలకు వేతనాలు పెరగలేదన్నారు. కొత్తగా తెచ్చిన బాలసంజీవిని యాప్ వల్ల అంగన్‌వాడిలు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. అంగన్‌వాడిల సమస్యలు పరిష్కరించుకుంటే భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు సోయం చినబాబు, అంగన్‌వాడి జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి, గౌరవ అధ్యక్షురాలు సున్నం రంగమ్మ, సవలం సునీత, కట్టం సుజాత, ఎం.అన్నపూర్ణ, యస్.లలిత, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో చోరీ

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. హెచ్‌ఎం గది తాళం పగలగొట్టి చొరబడి 43 ట్యాబ్‌ల్లోని 16 టాబ్‌లు చోరీ చేశారు. హెచ్‌ఎం కార్యాలయం లో టేబుల్ మీద గ్లాస్ ఫర్నిచర్‌ను పగలగొట్టి, వస్తువులన్నీ చిందర వందర చేశారు. అనంతరంబీరువాలో ఉన్న 16 టాబ్‌లను చోరీ చేసి పరారయ్యారు. చోరీ జరిగే సమయానికి సెక్యూరిటీ సిబ్బంది లేరని హెచ్‌ఎం తెలిపారు. చోరీ జరిగిన సమయంలో హాస్టల్లో కరెంట్ కూడా లేకపోవడంతో సిసి కెమెరాల్లో రికార్డు కాలేదని తెలిపారు. ఈ ఘటనపై హెచ్‌ఎం లోత మల్లమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



దుండగులు ధ్వంసం చేసిన ఫర్నీచర్

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-యంత్రాంగం

డుంబ్రిగుడ: పదవి కాలాన్ని వృథా చేయకుండా నిత్యం ప్రజల పక్షాన నిలిచి టిడిపి పూర్వ వైభవానికి కృషి చేస్తానని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో ఆనందరావు అన్నారు.సంస్థగత ఎన్నికల్లో భాగంగా నూతనంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడిగా నియమితులైన ఆయన మాట్లాడారు. పార్టీ వెన్నంటి ఉండి మండలంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ సభ్యుల గెలుపుకు కృషి చేస్తానన్నారు.

అరకులోయ రూరల్: టిడిపి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, పార్టీ పట్ల బాధ్యతగా వ్యవహరిస్తానని నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు ఎల్ మహేష్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి లోకేష్, రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు తనకు పదవీ బాధ్యతలు అప్పగించిన అరకు ఇన్చార్జి, విజయనగరం ఎపిఎస్ఆర్టీసీ నియ్యార్ దొన్నుదొర కు, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేసే దిశగా వ్యవహరిస్తూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి- **అరకులోయ రూరల్:** జిల్లా ప్రజల సమస్యలు పరిష్కరించి వారికి మేలు చేయడమే జాతీయ మానవ హక్కుల సంఘం లక్ష్యమని, ఆ సంఘం జిల్లా చైర్మన్ పంచాది రాజేష్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు హక్కులను స్పష్టంగా తెలుసుకోవాలన్నారు. ప్రజలు ఎటువంటి అన్యాయాలకు పాల్పడకుండా ఉండాలన్నారు.

విద్యా కిట్లను పరిశీలిస్తున్న ప్రాజెక్టు అధికారి

విద్యా కిట్లను ముందుగా అందజేయాలి

ప్రజాశక్తి **-అనంతగిరి:** 2026 విద్యా సంవత్సరంలో భాగంగా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లను తక్షణమే అందజేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ స్వామి నాయుడు ఆదేశించారు. శనివారం మండలంలో పర్యటించి కిట్లు భద్రపరిచి ఉన్న స్టాక్ పాయింట్లను పరిశీలించారు ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికల బాలురుకు సంఖ్య ఆధారంగా కిట్లను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులకు అప్పగించాలని మండల విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె. బాలాజీ, స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ గణేష్, అంజనేయులు. కె. రామకృష్ణ, సునీత, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

అప్పన్నను దర్శించుకున్న ఎన్నికల కమిషనర్

ప్రజాశక్తి-**పెందుర్తి** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని (రిటైర్డ్ ఐఎఎస్) దంపతులు శనివారం శ్రీవరాహలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్య నిర్వహణాధికారి ఎన్.సుజాత సాదరంగా స్వాగతం పలికారు. వారు ముందుగా కప్పు స్తంభాన్ని అలింగనం చేసుకున్నారు. అప్పన్న దర్శనం అనంతరం స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి జ్ఞాపిక, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి పిల్లా శ్రీనివాసరావు, పిఆర్ఒ నాయుడు, విఆర్ఒ మణికంఠ తదితరులు పాల్గొన్నారు

గ్రూప్- 1, 2 రాష్ట్ర సివిల్ సర్వీసెస్ నుంచి ఐఎఎస్‌గా ప్రమోషన్ పొందిన అధికారులు ఇండక్షన్ శిక్షణ, అధ్యయన పర్యటనలో భాగంగా శనివారం సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు. వీరికి ఆలయ డిఇఒ రాధ సాదర స్వాగతం పలికారు. వారు ముందుగా కప్పస్తంభాన్ని అలింగనం చేసుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం వేద పండితులచే వేద ఆశీర్వచనం ఇప్పించారు. స్వామివారి శేష

రోడ్డు పనులు ప్రారంభించాలి

నిరసన చేపడుతున్న గిరిజనులు

సిపిఎం ఆధ్వర్యంలో వినూత్న నిరసన

ప్రజాశక్తి **-అనంతగిరి:** ఫారెస్ట్ శాఖ అభ్యంతరంతో నిలిచిన రోడ్డు పనులు వెంటనే పునరుద్ధరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు సిపిఎం ఆధ్వర్యాన శనివారం గ్రామం వద్ద వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఫారెస్ట్ అనుమతులు వెంటనే ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు చేతులు జోడించి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. వెంకన్న మాట్లాడుతూ, అనంతగిరి మండలం పరిధి గుమ్మ పంచాయతీ కళ్యాణగుమ్మి బీటీ రోడ్డు నిర్మాణానికి ఎంజి ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద గత ఏడాది నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సంబంధిత ఉన్నతాధికారులు కాంట్రాక్టర్‌తో దేవరపల్లి మండలం వాళ్లకు పంచాయితీ నేరుడువలస గ్రామం మీదుగా కళ్యాణగుమ్మి వరకు రోడ్డు పనులు చేపట్టేందుకు పనులు ప్రారంభించడంతో ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం జరిగిందని, దీంతో పనులు నిలిపివేయాయని తెలిపారు. సుమారు నాలుగు గ్రామాల గిరిజనులు పంచాయితీ కేంద్రానికి నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా, రోగులకు ఆసుపత్రులకు తరలించాలన్నా డోలీ సహాయంతో కొండ కోన నడువ కిలోమీటర్ల దూరం వెళ్లవలసి వస్తుందని తెలిపారు. తక్షణమే కలెక్టర్ స్పందించి ఫారెస్ట్ అనుమతులు వెంటనే ఇచ్చి రోడ్డు పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు డొంబు, బోడన్న, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరు: ప్రభుత్వ భూముల ఆక్రమణలను స్వాధీనం పై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. ఆక్రమణల దారులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ నుండి తహశీలద్దారులు, ఎంపిడి ఓలు, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. బంజరు, ప్రభుత్వ, నీటి పారుదల భూములు, చెరువులు ఆక్రమణలను ఈనెల 31లోపు గుర్తించి రిపోర్టులు సమర్పించాలని చెప్పారు. ఆక్రమణదారులకు ఫారం 7 నోటీస్ జారీ చేయాలని సూచించారు. స్పీకింగ్ ఆర్డర్ జారీ చేసాక ఎన్ని రోజుల్లో తొలగిస్తారని తహశీల్దారులను ప్రశ్నించారు. ఎల్టి ఆర్ చట్టం ప్రకారం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పోలవరం పునరావాస పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ వారం రోజుల్లో పునరావాస కాలనీలకు 12 గ్రామాలను తరలించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలను ఎం. బుక్ నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి వి. అభిషేక్, సబ్ కలెక్టర్లు శౌర్యమన్ పటేల్ కల్పశ్రీ, చింతూరు పి ఓ అపూర్వ భరత్, డి ఆర్ ఓ కె.పద్మలత, 22 మండలాల తహశీల్దారులు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని ప్రభుత్వ భూములు ఆక్రమణలు గుర్తించి చర్యలు తీసుకోవాలని అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఇన్ చార్జి తహసిల్దార్ ఎస్ మాణిక్యం. ఎంపీడీవో ఏ వివి. కుమార్ సమక్షన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వ భూములలో ఆక్రమణలు, అక్రమ కట్టడాలు వంటి వాటిపై ఈనెల 28వ తేదీలోపు గుర్తించి వివరాలు తెలియజేసినట్లయితే దానిపై నివేదిక తయారు చేసి ఈనెల 31 తేదీలోపు జిల్లా కలెక్టర్ కు నివేదిక అందజేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఆక్రమాలను గుర్తించి తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు అందున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ శాఖ ఆర్ఐ పి. శంకర్రావు పలుశాకల సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరిలో మాట్లాడుతున్న అధికారులు

పినగాడిలో కొండచిలువ కలకలం

ప్రజాశక్తి-**పెందుర్తి** : పెందుర్తి మండలం పినగాడి పంచాయతీ పరిధిలోని సూరపనేని సుబ్రమణ్యం పంట పొలాల్లో సుమారు 12 అడుగుల పొడవు గల కొండచిలువ కలకలం రేపింది. స్థానికులు కొండచిలువను చూసి స్నేక్ కేచర్ రొక్కం కిరణ్‌కుమార్‌కు ఫోన్ చేశారు. శనివారం ఉదయం రెస్క్యూ టీమ్‌తో కలిసి కిరణ్‌కుమార్ పొలం వద్దకు చేరుకొని కొండచిలువను పట్టుకున్నారు. ఆ పొలంలో కొండచిలువ గుడ్లు కూడా ఎక్కువగా కనిపించాయి. అనంతరం కొండ చిలువను కంబాల కొండకు సురక్షితంగా తరలించారు. ఈ సందర్భంగా స్నేక్ కేచర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, ఇప్పటివరకు తాను సుమారు 3500 పాములను పట్టుకున్నట్టు తెలియజేశారు. ఎక్కడైనా విష సర్పాలు కనిపిస్తే 8866368899 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

నేరాలు ఘోరాలు

గూడ్సు రైలు ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి **-డుంబ్రిగూడ:** మండలంలోని కురిడి రైల్వే ఎల్సీ గేటి సమీపంలోని ట్రాక్ లో గుర్తు తెలియని వృద్ధ మహిళ నడిచి వెళ్తుండగా గూడ్సు రైలు ఢీ కొట్టిందని విజయనగరం జీఆర్పీఎస్ ఎస్సై బాలాజీరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు. కురిడి రైల్వే ట్రాక్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని గిరిజన వద్ధ మహిళ ట్రాక్ నడిచి వెళ్తుండగా గూడ్సు రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గుర్తు తెలియని వృద్ధురాలి వయస్సు సుమారు 65 ఏళ్లు ఉండవచ్చని చెప్పారు. మృతురాలి గుర్తుకు ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 9490617089కు సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

కాలువలో పడి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్నేహితులతో క్రికెట్ ఆడుకుంటానని ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పి వెళ్లిన కుమారుడు విగతజీవిగా మారాడు. దీనికి సంబంధించి స్టీల్‌ప్లాంట్ పోలీసుల కథనం ప్రకారం...అగనంపూడి శనివాడ ప్రాంతానికి చెందిన చట్టి పైడిరాజు కుమారుడు చట్టి యశ్వంత్ (13) శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో స్నేహితులతో కలిసి ఆడుకొవటానికి వెళ్తానని చెప్పి బయటకు వెళ్లాడు. యశ్వంత్ అగనంపూడి సమీప ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తూ పడిపోయాడు. కాలువ నీటి ప్రవాహానికి కెబిఆర్ రిజర్వాయర్‌లోకి కొట్టుకొచ్చాడు. రిజర్వాయర్ వద్ద మృతదేహాన్ని గుర్తించిన సిబ్బంది స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని విద్యార్థిగా పోలీసులు తొలుత భావించారు. మృతుని ఫొటో వాట్సాప్ గ్రూపులో షేర్ చేశారు. ఈ క్రమంలోనే ఆడుకుంటానని వెళ్లిన కుమారుడు సాయంత్రం అయినా ఇంటికి చేరకపోవటంతో యశ్వంత్ తండ్రి స్థానికంగా అందరినీ అడుగుతూ తిరుగుతున్నాడు. వాట్సప్ గ్రూప్‌లో వచ్చిన యశ్వంత్ ఫొటోను కొందరు చూపించడంతో తమ కుమారుడేనంటూ తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఎంత మంది ఆటకు వెళ్లారు, ప్రమాదంగానే కాలువలో జారిపడిపోయాడా, మరే ఇతర కారణం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో దివీస్ ఉద్యోగి దుర్మరణం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి సంగివలస ఎన్‌హెచ్-16 జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పోలమాంబ గుడి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దివీస్ ఉద్యోగి మృతి చెందారు. సిఐ బి.తిరుమలరావు కథనం ప్రకారం.. సంగివలస ఆరాధ్య హాస్టల్‌లో ఉంటున్న చిప్పాడ దివీస్ ఉద్యోగి ఉప్పలపాటి తిరుమలాదేవి (24) శనివారం మధ్యాహ్నం సుమారు 12.45 గంటలకు విధులకు హాజరయ్యేందుకు సహచర ఉద్యోగి లీలా కల్యాణితో కలిసి బయల్దేరారు. రోడ్డు అవతల దివీస్ సంస్థ బస్సు ఉంది. ఆ బస్సులో డ్యూటీకి వెళ్లేందుకు రోడ్డు డివైడర్ దాటుతుండగా విశాఖ నుంచి విజయనగరం వెళ్తున్న కారు తిరుమలా దేవిని బలంగా ఢీకొని, సుమారు 20 మీటర్ల దూరం ఈడ్చుకు వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సహచర ఉద్యోగి కడియాల పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాధాకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి స్వగ్రామం కృష్ణా జిల్లా, చాట్రాయి మండలం, సోమవరం పోస్టు, కొత్త గూడెంగా పోలీసులు పేర్కొన్నారు.

జీవశాస్త్రం పరీక్షకు 1753 మంది హాజరు

ప్రజాశక్తి - ఆరిలోవ : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలో భాగంగా శనివారం జీవశాస్త్రం పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2197 మంది విద్యార్థులు హాజరుకావలసి ఉండగా 1753 మంది హాజరయ్యారని, 444 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఓపెన్ స్కూలు పది, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. పదోతరగతి శాంఘిక శాస్త్రం పరీక్షకు 8 కేంద్రాల్లో 200 మంది విద్యార్థులకు 167 మంది హాజరయ్యారని, ఓపెన్ స్కూలు ఇంటర్‌లో 4 కేంద్రాల్లో జరిగిన జీవశాస్త్రం పరీక్షకు 154 మంది విద్యార్థులకు గానూ 130 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

నేడు మీడియా ప్రతిభా పురస్కారాలు

- దేశ, విదేశీ కళాకారులతో 'కళా సంబరం'

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: వైజాగ్ మీడియా అవార్డ్స్, స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ ఆదివారం జర్నలిస్టుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నామని నిర్వాహక కమిటి చైర్మన్ గంట్ల శ్రీనుబాబు, చీఫ్ ఆర్గనైజర్ ఆర్.నాగరాజు పట్నాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సిరిపురం విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరినాలో జరిగే కార్యక్రమంలో ఎంబిఎ, ఎంబిబిఎస్, ఎంఎల్, బి.ఎల్ నర్సింగ్, ఇంజినీరింగ్ చదువుతున్న 33 మందికి, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, డ్యాన్స్, మ్యూజిక్ వంటి విభాగాల్లో మరో పది మంది జర్నలిస్టుల పిల్లలకు కలిపి మొత్తం 40 మందికి ఈ ప్రతిభా పురస్కారాలను ప్రధానం చేస్తున్నామన్నారు. అదేవిధంగా ఎల్‌కెజి నుంచి ఇంటర్, డిగ్రీ కలుపుకుని అత్యధిక మార్కులు సాధించిన 121 మంది జర్నలిస్ట్ పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్కూల్ ఆఫ్ థియేటర్స్ ఆర్ట్స్ సహకారంతో శ్రీలంకలోని కొలంబో, ఇండియాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అంతర్జాతీయ స్థాయి కళాకారులతో పాటు హర్షితటీనా, జి.డింపుల్, పూజితచందన, దాసరి గీతికశ్రీ, నలనాగులభవ్యశ్రీ బృందం శాస్త్రీయ, జానపదనృత్యాలు ప్రదర్శిస్తారన్నారు.

జిసిసి మేనేజర్‌గా గౌరమ్మ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి జిసిసి మేనేజర్‌గా గౌరమ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన మేనేజర్ విజయలక్ష్మి అడ్డతీగల బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా రాజవొమ్మంగి బ్రాంచ్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న గౌరమ్మ పదోన్నతి పై మేనేజర్‌గా విధుల్లోకి చేరారు. రాజవొమ్మంగి జిసిసి సూపర్ బజార్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ దళ్లే మాతయ్యమ్మ ఇదే బ్రాంచ్‌లో అకౌంటెంట్‌గా ప్రమోషన్ పొందారు. జూనియర్ అసిస్టెంట్ ప్రమీలారాణి సూపర్‌బజార్‌కు బదిలీ అయ్యారు.

జిసిసి మేనేజర్ గౌరమ్మ

రైలు ప్రమాదంలో సీలేరు యువకుడు మృతి

ప్రజాశక్తి -సీలేరు: కాకినాడ జిల్లా తుని వద్ద జరిగిన రైలు ప్రమాదంలో సీలేరుకు చెందిన యువకుడు ఆషిక్ మృతి చెందడంతో విషాదఛాయలు అలముకున్నాయి. సీలేరులోని మేకల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్న ఆలీ కుమారుడు ఆషిక్ విశాఖలోని ఎవియన్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే తుని వద్ద జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందాడు. తండ్రి ఆలీ మాట్లాడుతూ శుక్రవారం కాలేజీ ఫీజు చెల్లించాలని డబ్బులు కావాలని ఫోన్ చేసాడని ఫీజుకి కావాల్సిన నగదు వెంటనే పంపించానని అయితే ఏ విధంగా మృతి చెందాడన్నది పూర్తి సమాచారం అందలేదన్నారు. ఆషిక్ మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచారని బంధువులు పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

ఆషిక్ (ఫైల్ ఫొటో)

జర్నలిస్టుల సమస్యలు పట్టవా ?

- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా, జర్నలిస్టులకు కనీసం అక్రిడేషన్ వంటి గుర్తింపు కార్డులు కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్‌కుమార్ ఆరోపించారు. శనివారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, జర్నలిస్టుల పిల్లల ఫీజుల కోసం రూ.10 వేలు అందజేశారు. ప్రజాఫోకస్ రిపోర్టర్ భాషా కుమార్తె కళాశాల ఫీజు నిమిత్తం రూ.5 వేలు, మరొక ప్రముఖ జర్నలిస్టుకు రూ.5 వేలు సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యావేత్తగా పిల్లల ఉన్నత చదువులు అభ్యసించాలని, వారి విద్య కోసం తోచిన ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలన్నారు.కార్యక్రమంలో వైసిపి 30వ వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, ముజుబ్‌ఖాన్, చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల కుటుంబాలకు నగదు అందిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

తప్పిపోయిన పిల్లల న్యాయసేవలపై అవగాహన కల్పించాలి

మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : తప్పిపోయిన పిల్లల కోసం అందుబాటులో ఉన్న న్యాయ సేవలు, న్యాయసహాయం గురించి ప్రజలకు, తల్లిదండ్రులకు విస్తతంగా అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు స్పష్టం చేశారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, విశాఖపట్నం ఆధ్వర్యంలో అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవ అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మహిళా శిశసంక్షేమశాఖ సహకారంతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి సన్యాసినాయుడు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లకు అనుసంధానమై ఉన్న పారాలీగల్ వాలంటీర్లు (పిఎల్‌విఎస్) ద్వారా తప్పిపోయిన పిల్లలకు సంబంధించిన కేసుల్లో అవసరమైన న్యాయ సహాయం లేదా సలహాలను పొందవచ్చని తెలిపారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, సంబంధిత శాఖలు, స్వచ్ఛంద సంస్థలతో (ఎన్‌జిఒలు) సహా వివిధ భాగస్వాముల మధ్య సమర్ధమైన సమన్వయాన్ని ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. తప్పిపోయిన పిల్లల సంక్షేమం కోసం పనిచేస్తున్న ఎన్‌జిఒలు ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవసరమైన సంపూర్ణ న్యాయ సహాయాన్ని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డిఎల్ఎస్ఎ) ఉచితంగా అందిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రామచంద్రరావు(స్పెషల్ మేజిస్ట్రేట్) డి.లక్ష్మణరావు, (ఎసిపి క్రైమ్స్), కె.వి. రామలక్ష్మి (ప్రాజెక్ట్ డైరెక్టర్, మహిళా శిశు సంక్షేమశాఖ) తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

యుపిఎస్‌సి పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యుపిఎస్‌సి ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ శనివారం పరిశీలించారు. ఎవిఎన్ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కేంద్రాలతో పాటు, వివిధ కేంద్రాలను సందర్శించి పరిస్థితులను గమనించారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎవిఎన్ కళాశాలలో ఇన్విజిలేటర్ల శిక్షణ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ వారికి పలు సూచనలు చేశారు.

సుకుమారన్ మృతి పార్టీకి తీరని లోటు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిపిఐ నగర మాజీ కార్యవర్గ సభ్యుడు, ఇస్కఫ్ జాతీయ నాయకుడు, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్, కేంద్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకుడు, టి.ఎస్.సుకుమారన్ మృతి పార్టీకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం. పైడిరాజు అన్నారు. శనివారం అల్లిపురం సిపిఐ జిల్లా కార్యాలయంలో సుకుమారన్ సమస్తముల కార్యక్రమం నిర్వహించారు. పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహమాన్ నివాళులర్పించారు. అనంతరం వీరు మాట్లాడుతూ అయన మృతి వారి కుటుంబానికి, పార్టీకి, ఉద్యమానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు కె. సత్యాంజనేయ, పి.చంద్రశేఖర్, ఎం.మన్మథరావు, వనజాక్షి, క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్‌ఒల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయుష్మాన్ ఆరోగ్య కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్లు 27వ రోజు శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.ఎన్.ఎస్ ప్రజ్ఞ మాట్లాడుతూ వైద్య,ఆరోగ్య శాఖలో ఎన్ హెచ్ఎం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలన్నారు. 27 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం అన్నారు. ఎన్ హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనం పెంచి చెల్లించాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకా లను క్రమబద్ధీకరించాలన్నారు. ఈపిఎఫ్ పునరుద్ధరించాలన్నారు. ధర్నాలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు కార్యదర్శి గంట సుధ, మోజెస్, జస్వంత్, కల్పన,సుధా, మణి,స్వాతి,అమిత, అరుణ, దివ్య, సూర్యకళ పాల్గొన్నారు.

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సిహెచ్‌ఒలు

పోలీస్ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు

మాట్లాడుతున్న జిల్లా పోలీసు అధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, అనకాపల్లి జిల్లాలో 45 సంవత్సరాల పైబడి వయస్సు ఉన్న సుమారు 750 మంది పోలీసు సిబ్బందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. శనివార వెంకోజీపాలెంలోని మెడికవర్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య పరీక్షలను విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్‌జట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, పోషకాహారం తీసుకోవాలని వ్యాయామం చేయడంతో పాటు సానుకూల దృక్పథంతో జీవించాలని సూచించారు. అనంతరం అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ పనిఒత్తిడితో పాటు శారీరక మానసిక ప్రయాసలకు లోనవుతున్న సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ ఆసుపత్రిలో 13రకాల పరీక్షలు గుండె, కిడ్నీ, మహిళలకు మామోగ్రఫీ తదితర ఖరీదైన పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నారు. విశాఖపట్నం, వెంకోజీపాలెంలో ఉన్న మెడికవర్ హాస్పిటల్, అచ్యుతాపురానికి చెందిన ఋషిల్‌డెకర్స్ లిమిటెడ్ సహకారంతో ఈ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు నేటి నుండి ప్రారంభమవుతాయని, ప్రతి రోజు 50మంది చొప్పున పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో మెడికవర్ సెంట్రల్ హెడ్ డాక్టర్ సిహెచ్.అరుణ్‌కుమార్, ఋషిల్ డెకర్ లిమిటెడ్ కంపెనీ ఉపాధ్యక్షుడు ఏ.కె.రాయ్, అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, డిటిసి డిఎస్పి బి.మోహనరావు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, బాలసూర్యారావు, అప్పలనాయుడు, నరసింగరావు ఎస్సైలు ఆదినారాయణ, విశ్వనాథం పోలీస్ సిబ్బంది, అనకాపల్లి జిల్లా సివిల్ ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి జి.సాయిప్రశాంత్

14 మంది జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని రంపచోడవరం డిఎస్పి జి.సాయిప్రశాంత్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ఆదేశాల మేరకు రాజవొమ్మంగి, అడ్డతీగల సిఐలు ఎన్.సన్యాసినాయుడు,ఎన్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో గంగవరం, అడ్డతీగల, జడ్డంగి ఎస్ఐలు బి వెంకటేశ్వరరావు, వినోద్, చినబాబు తమ సిబ్బందితో శనివారం సాయంత్రం మండలంలోని కిమ్మిలిగడ్డ గ్రామ శివార్లలో అటవీ ప్రాంత సమీపంలో జూదం ఆడుతున్నారని సమాచారం మేరకు దాడులు చేశారు. 14 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్దనుండి రూ.1.95 లక్షలు నగదు, 19 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు.కొంతమంది తప్పించుకుని పారిపోయారని వారిని ఇంకా అదుపులోనికి తీసుకోవాల్సి ఉందన్నారు. గంగవరం అడ్డతీగల తదితర ప్రాంతాల్లో కూడా ఇటీవల గ్యాంబ్లింగ్ శిబిరాలపై దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాలుపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.